క్లుప్తంగా

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ



కంటి అద్దాలు అందుకున్న విద్యార్థులతో పీహెచ్‌సీ డాక్టర్, ప్రిన్సిపాల్

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో 29 మంది విద్యార్థులకు మంగళవారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సాపురం పీహెచ్‌సీ వైద్యులు బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల చూపుపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగానే కంటి పరీక్షలు చేసి లోపం ఉన్నవారికి కంటి అద్దాలు అందజేస్తుందన్నారు.

మందుల కొరత ఉంది



రుద్రవరం పశు వైద్యశాల తనిఖీలో మాట్లాడుతున్న డీడీ

రుద్రవరం: పశువులకు పూర్తి స్థాయి వైద్యం అందించేందుకు అవసరమైన మందులు లేవని, ఆసుపత్రుల్లో కొరత ఉందని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు(డీడీ) రమణయ్య అన్నా రు. మంగళవారం ఆయన మండలంలోని చిన్నకంబలూరులో పశు గణన సర్వేకు సంబంధించి విచారణ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో రికార్డులను పరిశీలించారు. ఇటీవల పూర్తైన పశు గణన సర్వే సక్రమంగా సాగిందా లేదా అని తాము గ్రామాలకు వెళ్లి విచారిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం మండలంలోని చిన్నకంబలూరులో విచారణ నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

క్యాంపస్ సెలెక్షన్లో 146 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన నిరుద్యోగులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన క్యాంపెస్ సెలెక్షన్‌లలో వివిధ ప్రాంతాల నుంచి 146 మంది నిరుద్యోగ యువతీయువకులు పాల్గొన్నట్లు చైర్మన్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎంపికైన వారికి అల్‌డిగో టెక్ చెన్నైలో ట్రెన్ ఎగ్జిక్యూటివ్‌లో రూ.17వేల వేతనం ఇస్తారన్నారు. సదరు కంపెనీ మేనేజర్ బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ రాబోయే కాలంలో మారిన విద్యావిధానానికి అనుగుణంగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు అక్రమ్, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ప్రగతిరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం



ఆర్.కొత్తపల్లెలో కాలి బూడిద అయిన పూరి గుడిసెను చూపుతున్న బాధితుడు

రుద్రవరం: మండల పరిధిలోని ఆర్.కొత్తపల్లెలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఎద్దుల ఓబన్న అనే వ్యక్తికి సంబంధించిన పూరి గుడిసె దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. రాత్రి అందరు నిద్రించాక గుడిసె పైభాగం నుంచి మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించింది. అయితే, వెంటనే ఇంటి యజమానులు గమనించి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు పరుగున వచ్చి మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయితే, క్షణాల్లో గుడిసె కాలి బూడిద అయ్యింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తు సామగ్రి, ధాన్యం వంటివన్నీ కాలిపోయి కట్టు బట్టలతో మిగిలామని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి నష్టాన్ని అంచనావేశారు.

అంగన్‌వాడీలకు 'యాప్' సోపాలు

- మొరాయిస్తున్న మొబైల్ ఫోన్లు
- సాంకేతిక సమస్యతో సతమతం
- పిల్లల వివరాల నమోదుకు ఆటంకం



నంద్యాల మండలం చాపిరేవుల అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాబుద్ధులు నేర్పుతున్న కార్యకర్త

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందిని యాప్‌ల సమస్య వెంటాడుతోంది. వీరు పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే సాంకేతిక సమస్యల కారణంగా మొబైల్ ఫోన్లు తరుచూ మొరాయిస్తున్నాయి. జిల్లాలోని అంగన్‌వాడీలు రోజువారీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం సరఫరా చేస్తున్న చిక్కీలు, కోడిగుడ్లు, బాలామృతం, ఆకుకూరలు, ఆహారం తీసుకోవాలని చెబుతూ, మరోవైపు మాతాశిశు మరణాలు జరగకుండా ఉండేందుకు, సుఖ ప్రసవాల కోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సమస్యలతో సతమతం...

జిల్లాలో 1,663 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులు 89,530 మంది ఉన్నారు. వీరి వివరాలను ప్రతిరోజు హాజరు పట్టికలో నమోదు చేయాలి. పిల్లల ఫొటో తీసి పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఏ రోజుకారోజు చిన్నారుల గ్రూప్ ఫొటోలు తీసియాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన తర్వాత ఉదయం నుంచి సాయంత్రం లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అయితే, సాంకేతిక సమస్యలతో ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్లు సరిగా పనిచేయడం లేదు. ఈ ఫోన్లలో స్టోరేజ్, ర్యామ్ తక్కువగా ఉండడంతో ఫోన్ హ్యాంగ్ అవుతోందని, మరమ్మతులకు గురైతే సర్కారు కొత్తఫోన్లు ఇవ్వడం లేదంటూ అంగన్‌వాడీలు వాపోతున్నారు.

అధికారుల బెదిరింపులు...

ఓ వైపు సాంకేతిక సమస్యలతో మొబైల్ ఫోన్లు పని చేయక అంగన్‌వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే..మరోవైపు అధికారులు యాప్‌లో పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయకపోతే వేతనాల్లో కోత విధిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. యాప్ లోపాల వల్ల వర్కర్లు కేంద్రంలో ఉన్నప్పటికీ లోకేషన్ స్థానికంగా చూపక పోవడంతో వివరాలు నమోదు కావడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అప్‌లోడ్ చేసినా ప్రయోజనం లేదని తలలు పట్టుకుంటున్నారు. సమస్య గురించి పలుమార్లు అధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

నాణ్యమైన మొబైల్స్ ఇవ్వాలి



ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు నాణ్యమైన మొబైల్‌ఫోన్లు అందజేయాలి. 90శాతం ఫోన్లు పని చేయడం లేదు. అధికారులు వాటికి మరమ్మతులు కూడా చేయించడం లేదు. పిల్లల వివరాలు మాత్రం ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలంటారు. తప్పని పరిస్థితిలో కొందరు పర్సనల్ మొబైల్స్‌ను వాడుతున్నారు. ఏది ఏమైనా అధికారులు సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి.

–నిర్మల, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, నంద్యాల

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

నంద్యాల(అర్బన్): యూరియా అమ్మకాలకు సంబంధించి ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని సంజీవరెడ్డి ఏజెన్సీస్, న్యూ వసువాహిణి ఆగ్రో ఏజెన్సీస్, బైసాని ట్రేడర్స్ దుకాణాల్లో యూరియా క్రయ, విక్రయాలు, రిజిస్టర్లు, బిల్ బుక్‌లు, ఎరువుల నిల్వలను ఏఓ ప్రసాదరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ డీలర్లు యూరియాను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించరాదన్నారు.

స్వయం ఉపాధికి 244 దరఖాస్తులు

ఉయ్యాలవాడ : స్వయం ఉపాధి ఏర్పాటుకు కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు మండలంలో 244 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. కాపు– 26 మంది, వైశ్య 5, రెడ్డి 11, బీసీ కులాలకు చెందిన 202 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. బుధవారం వాటి పరిశీలన జరుగుతుందన్నారు.

హలో.. హలో.. హలో..!

- శ్రీశైలంలో పనిచేయని మొబైల్ సిగ్నల్
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా శ్రీశైలం మండల పరిధిలో అన్ని మొబైల్ నెట్‌వర్క్స్ పనిచేయడం లేదు. దీంతో మొబైల్ వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. అసలే శ్రీశైల క్షేత్రానికి అనునిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తారు. అందులో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు మరింత మంది తరలివస్తారని, మొబైల్ నెట్‌వర్క్స్‌కు ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తిస్థాయిలో వినియోగదారులకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, ప్రైవేట్ మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్లను ఆదేశించారు. అయినప్పటికీ అధికారులు స్పందించ లేదు. దీంతో శ్రీశైలం మండలంలో నెట్‌వర్క్ సమస్యతో భక్తులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిర్‌టెల్, జియో తదితర ప్రైవేట్ నెట్‌వర్క్స్ సైతం వినియోగదారులకు సేవలందించడం లేదు. సిగ్నల్ సమస్యతో భక్తులకు, స్థానిక ప్రజలకు సమాచార లోపం ఏర్పడుతుంది. ఎక్కడ చూసిన హలో.. హలో.. హలో..! అంటూ మొబైల్ నెట్‌వర్క్ సేవలపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్రీశైలం మండల పరిధిలో మొబైల్ నెట్‌వర్క్ సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు భక్తులు కోరుతున్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(వ్యవసాయం): ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు దేవదాయ శాఖ ఉప కమిషనర్ గురుప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ప్రథమనందీశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో దేవస్థానానికి చెందిన మూడు ఎకరాల ఖాళీ స్థలానికి వేలం పాటలు నిర్వహించారు. వై.శ్రీనివాసరావు అనే గుత్తేదారుడు ఈ భూములను అధిక మొత్తంలో పాట పడి దక్కించుకున్నాడు. ఏడాదికి మూడు ఎకరాలకు రూ.6.20 లక్షల అద్దె, ప్రతి మూడేళ్లకోసారి అద్దెపై 30 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రామానుజన్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చలం బాబు, కృష్ణారెడ్డి, రామశివారెడ్డి, శేషు, రజనీకాంత్, నరసింహులు, అర్చకుడు ప్రవీణ్, శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

విన్నపం

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డికి ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, సాంఘిక భద్రత, మున్సిపల్ శాఖ ఆధీనంలోనే ఉండాలని ప్రైవేటు కంపెనీలు, ఏజెన్సీలకు అప్పగించరాదన్నారు. అలాగే ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఓబులేసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివరాముడు, మస్తాన్, చిట్టెమ్మ తదితరులు ఉన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించకుండా, సమయం ఇవ్వకుండా నిర్మాణాలను కూల్చివేస్తున్నారని బాధితులు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డికి మంగళవారం విన్నవించారు.

ఆధ్యాత్మికం

వైభవంగా స్వాతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం స్వాతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ పంచామృత అభిషేకాలు స్నపన తిరుమంజన సేవా కార్యక్రమం నిర్వహించి స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వాతి పల్లకీ సేవ సమాజం ఆధ్వర్యంలో దేవాలయం ఆవరణలో స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మధుసూదన్ రాయలు, వేద పండితులు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అష్టాదళ పాదపద్మారాధన సేవ



అష్టాదళ పాదపద్మారాధన సేవలో శ్రీకాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం కాళికాంబాదేవికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తర్వాత అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ చేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో..



మూడురాళ్లపల్లెలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

చాగలమర్రి: మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, గణపతి, వీరభద్రస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా పులి చిన్న ఓబుళరెడ్డి దంపతులు, పులి పెద్ద ఓబుళరెడ్డి దంపతులు హాజరయ్యారు. వార్షికోత్సవంలో భాగంగా ఉదయం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివారి కల్యాణం మహోత్సవం నిర్వహించారు.

చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను పెంచాలి



మాట్లాడుతున్న విద్యాధికారి మనోహర్‌రెడ్డి

దొర్నిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను పెంచాలని మండల విద్యాధికారి మనోహర్‌రెడ్డి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమంలో భాగంగా జ్ఞానభారతి సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించే ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాలు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం లక్ష్యాలకు అనుగుణంగా ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు శిక్షణలో తెలుసుకున్న విషయాలను కేంద్రాల్లో అమలు చేయాలని ఎంపీడీఓ సావిత్రి సూచించారు. హెచ్ఎం శ్రీనివాసరావు, మండల రీసోర్స్ పర్సన్ రజాక్‌బాషా, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): చిన్నారుల్లో పునాది అభ్యసన సామర్థ్యాలను మెరుగు పరచాలని నంద్యాల అర్బన్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ తెలిపారు. స్థానిక ఖాదరబాద్ నర్సింగరావు మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఏపీ అభ్యసన పరివర్తన సహాయ పథకం కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ బ్రహ్మంనాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు ప్రారంభం

శిరివెళ్ల: గోవిందపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు 6 రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంఈఓ శంకరప్రసాదు మాట్లాడుతూ చిన్నారులకు ప్రీ ప్రైమరీ స్కూల్‌లో బోధించడానికి జ్ఞాన జ్యోతి కింద 6 రోజుల పాటు అంగన్‌వాడీ టీచర్లకు వృత్త్యంతర శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

గోస్పాడు: అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని సీడీపీఓ చంద్రకళ, ఎంఈఓ అబ్దుల్‌కరీం అన్నారు. మండల కేంద్రమైన గోస్పాడులోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో మంగళవారం అంగన్‌వాడీ సిబ్బందికీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్పు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ పద్మావతి, హెచ్ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్‌లో విద్యార్థులకు బోధించడానికి గెస్ట్ లెక్చరర్ అవసరమని, ఎవరైనా అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ పీజీలో 55 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నెట్, సెట్ కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు విద్యార్హతలు, అనుభవం తెలిపే ఒరిజనల్ ధ్రువ పత్రాలతో ఈ నెల 25వ తేదీన జరిగే డెమో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

ఈ రోజు

నీటిసరఫరాకు అంతరాయం

నంద్యాల(న్యూటౌన్): మంచినీటి పైపులైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో బుధవారం పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయానికి పట్టణ ప్రజలు సహకరించాలని, అవసరమైతే 7702776048 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు

శిరివెళ్ల: సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న బీసీ, కాపు, ఈబీసీలకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. దరఖాస్తుదారులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లను తీసుకొని హాజరుకావాల్సి ఉంటుంది. వివిధ బ్యాంక్ ప్రతినిధులు హాజరై రుణాలిచ్చేందుకు దరఖాస్తులను పరిశీలిస్తారు. నేడు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో శిరివెళ్ల, చాగలమర్రి, దొర్నిపాడు, ఉయ్యాలవాడ తదితర మండలాల్లో ఈ కార్యక్రమం జరుగనుందని ఆయా మండలాల అధికారులు వెల్లడించారు.

ప్రతి రైతు యూనిక్ ఐడీ పొందాలి



మాట్లాడుతున్న డీడీఏ చెన్నయ్య

నంద్యాల(అర్బన్): ప్రతి రైతు యూనిక్ ఐడీ పొందాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ చెన్నయ్య తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నంద్యాల మండలం అయ్యలూరు, పెద్దకొట్టాల గ్రామాల్లో మంగళవారం స్థానిక రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను ఈ ఐడీ కార్డు ద్వారానే పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. సొంత భూమి ఉన్న రైతులు అర్హులని తెలిపారు. ఐడీ నమోదుకు రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, వన్‌బీ, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్‌నెంబరు తీసుకొని రైతు సేవా కేంద్రాలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్, ఏఓ ప్రసాదరావు, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ ఉమామహేశ్వరమ్మ, ఏఈఓ ముక్తార్‌బాషా, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏఓ

గోస్పాడు: ఎరువులను నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత దుకాణ డీలర్ల లైసెన్స్‌లను రద్దు చేస్తామని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి హెచ్చరించారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో మంగళవారం సాయికృష్ణ ఏజెన్సీస్, వెంకటసాయి, లక్ష్మి ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరం మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. దుకాణ దారులు ప్రతి రైతుకు తప్పని సరిగా విక్రయాలకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలన్నారు. బిల్లు బుక్‌లు స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదల నడ్డివిరుస్తున్న ప్రభుత్వాలు



గాంధీచౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై మోయలేని భారాలు వేస్తూ వారి నడ్డి విరుస్తున్నాయని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు బాలవెంకట్, తోటమద్దులు అన్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులది కాదని సంపన్నులదన్నారు. మంగళవారం పార్టీ నాయకుడు పుల్లా నరసింహులు అధ్యక్షతన గాంధీ చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయింపులు పెంచాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 50శాతం నిధులు కేటాయించాలని, దళిత గిరిజన సంక్షేమానికి, మహిళా సంక్షేమానికి కేటాయింపులు పెంచాలని, ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలని, బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డీఐలను ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రాలకు నిధుల బదిలీని పెంచాలని, కేంద్ర ప్రయోజిత పథకాలకు కూడా నిధులు పెంచాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు మహమ్మద్‌గౌస్, నరసింహ, వెంకటలింగం, జైలాన్, శివ, శీను, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



ఇంజేడు గ్రామ సమీపంలో వరి నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

ఆశల సాగు

ఉయ్యాలవాడ : గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలతో వరి పంట సాగు చేసిన రైతులు నష్టాలను చవి చూశారు. దీనిని పూడ్చుకునేందుకు రబీ సీజన్‌లో రెండో పంటగా కోటి ఆశలతో మరోసారి వరినాట్లు వేస్తున్నారు. మండలంలో ఖరీఫ్‌లో 1100 హెక్టార్లలో రైతులు వరి పంట సాగు చేశారు. దిగుబడులు చేతికందే తరుణంలో అధిక వర్షాలు తుపాన్ల ప్రభావంతో పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. కోతల సమయంలో కూడా వానలు తగ్గకపోవడంతో వరిపైరు నేలవాలి గింజలు రాలిపోయాయి. దీంతో ఎకరాకు 30 నుంచి 35 బస్తాలలోపే దిగుబడులొచ్చాయి. సర్కారు మద్దతు ధర కల్పించకపోవడంతో ఆ అరకొర వడ్లను బస్తా రూ. 1200 నుంచి రూ. 1,400 లోపే అమ్ముకోవలసి వచ్చింది. దీంతో చాలా మంది రైతులు పెట్టుబడులు కూడా చేతికందక పెద్ద ఎత్తున నష్టపోయారు. ఇప్పుడు కుందూనదిని నమ్ముకుని తీరం వెంట ఉన్న 14 గ్రామాల రైతులు పంట సాగు చేస్తున్నారు. అయితే, ఈ పంటకు చివరి వరకు సాగు నీరు అందుతుందా లేదా అన్న అనుమానాలు రైతులకు వెంటాడుతున్నాయి.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు





బండలాగుతున్న ఎద్దు (ఇన్‌సెట్‌లో) విజేత ఎడ్ల యజమానికి బైక్ అందజేస్తున్న దాత చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్

చాగలమర్రి: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో మంగళవారం రాష్ట్రస్థాయి సీనియర్ కేటగిరీ బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి, సాయిబాబా ఆలయాల ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన పులి చిన్న ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 16 జతల వృషభరాజములు హాజరయ్యాయి. ఇందులో బాపట్ల జిల్లా చూండూరు మండలం వేటపాళెం గ్రామానికి చెందిన అత్తోట రామకృష్ణకు చెందిన వృషభాలు 4,060 అడుగల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ వృషభరాజములకు దాత వైఎస్సార్‌సీపీ నాయకుడు వ్యాపారవేత్త చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్ రూ.1.35 లక్షల విలువ చేసే హోండా షైన్ మోటార్ సైకిల్ (125 సీసీ)ను బహుమతిగా అందజేశారు. 2వ స్థానంలో పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, 3వ స్థానంలో కడప జిల్లా ఓబులంపల్లె గ్రామానికి చెందిన సతీష్‌రెడ్డి, 4వ స్థానంలో నంద్యాల పట్టణానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, 5వ స్థానంలో కడప జిల్లా తిప్పారెడ్డిపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథ్‌రెడ్డి, 6వ స్థానంలో కడప జిల్లా వీరయ్య కుమ్మరి కొట్టాల గ్రామానికి చెందిన సురేఖ, 7వ స్థానంలో ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన తేజేశ్వరరెడ్డి వృషభాలు నిలిచాయి. 2వ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానికి హోండా షైన్ (100సిసి) మోటారు సైకిల్‌ను దాత కె.మోహన్‌రెడ్డి, రాచపల్లె రామాజనేయరెడ్డి అందజేశారు. మిగతా 3,4,5,6,7 స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేల రూపాయలను దాతలు షేక్.మహమ్మద్‌రఫీ, ఎస్.వెంకట మోహన్‌రెడ్డి, ఎస్ సూర్యానారాయణరెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, రఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పులి చంద్ర శేఖర్‌రెడ్డి, పులి కిరణ్‌రెడ్డి, పులి చంద్ర ఓబుళ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.